తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ. జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

బుధవారం
1 జూలై 2026

పేజీలు - 8



## 296.31 కిలోల గంజాయి దహనం

- **కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 30(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 57 కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 296.31 కిలోల డ్రై గంజాయి, 964 గంజాయి మొక్కలను జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనలను అనుసరించి, పర్యావరణ కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. వీటి విలువ 1.70 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. గత ఏడాది 53 కేసులకు సంబంధించి 117.856 కిలోల గంజాయి, 1,039 గంజాయి మొక్కలను ఇదే విధానంలో దహనం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించిన గంజాయిని నిబంధనల మేరకు నిర్మూలించడం జరిగిందన్నారు. కొందరు అక్రమార్జన కోసం గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడేస్తున్నారని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత స్థాయిలో తనిఖీలు, ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సాగు, రవాణా, విక్రయం లేదా వినియోగానికి పాల్పడిన వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీకి జిల్లా ఎస్పీ నితికా పంత్ చైర్మన్‌గా వ్యవహరించగా, కమిటీ సభ్యులుగా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ఇన్‌స్పెక్టర్లు రవీందర్, బాలాజీ వరప్రసాద్, శ్రీనివాస్, వేణుగోపాల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, మహేందర్, వెంకట కృష్ణ, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎండిన చెట్టు తొలగింపు

- **జనం సాక్షి ఎఫెక్ట్..**
- **అధికారుల స్పందనపై హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, బాటసారులు...**



**మంగపేట, జూన్ 30 (జనం సాక్షి) :** 'ప్రాణం పోయాక ఇచ్చే పరిహారాల కంటే... ప్రాణం ఉండగానే తీసుకునే నివారణ చర్యలు మిన్న' అనే నిజాన్ని గ్రహించి, ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్టును తొలగించిన అధికారులపై ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. మంగపేట ప్రధాన రహదారిపై ఉన్న ఓ భారీ వృక్షం పూర్తిగా ఎండిపోయి, ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితిలో ఉంది. నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై, ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఉండటంతో అంబులెన్స్‌లకు, రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవేళ చెట్టు కూలితే ఆసుపత్రికి వెళ్లే మార్గం మూసుకుపోవడంతో పాటు, పక్కనే ఉన్న హై-టెన్షన్ విద్యుత్ తీగలపై పడి ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని గమనించిన 'జనం సాక్షి' దినపత్రిక, "ప్రమాదం జరిగితేనే అధికారులు చర్యలు చేపడతారా ?" అంటూ సమస్య తీవ్రతను వివరిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు, యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి ప్రమాదకరంగా ఉన్న ఆ ఎండిన చెట్టు కొమ్మలను తొలగించారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించి, ప్రమాదాన్ని నివారించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు, సమస్యను వెలుగులోకి తెచ్చిన 'జనం సాక్షి' పత్రికకు వాహనదారులు, బాటసారులు మరియు స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్యతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు భయం వీడింది.


ప్రమాదం సంభవిస్తేనే చర్యలు చేపడతారా?

జనంసాక్షి

## పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత, జవాబుదారీతనం పెరగాలి

- **కమర్షియల్ సంస్థల్లో తప్పనిసరిగా రెండు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి**
- **విధులకు దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న సిబ్బందిని గుర్తించి చర్యలు చేపట్టాలి**
- **34వ డివిజన్ శివనగర్‌లో ఆకస్మిక తనిఖీలు**



**వరంగల్ ఎంజీఎం, జూన్ 30(జనంసాక్షి):** నగర పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత పెంపు, సమర్థవంతమైన సేవలందింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని 34వ డివిజన్ పరిధిలోని శివనగర్, తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించిన కమిషనర్ పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక వార్డు కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా రోజువారీ సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణలో స్పష్టమైన పురోగతి కనిపించేలా కార్యాచరణ రూపొందించాలని, చెత్త సేకరణ వాహనాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలను వెంటనే గుర్తించి శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని కమర్షియల్ దుకాణాలు తప్పనిసరిగా రెండు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని, ఇంకా ఏర్పాటు చేయని వ్యాపార సంస్థలు వారం రోజుల్లోగా వాటిని ఏర్పాటు చేసేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గృహాల నుంచి చెత్త సేకరణ కోసం నాలుగు రకాల వ్యర్థాల వర్గీకరణకు అనుగుణంగా డస్ట్‌బిన్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 5.20 గంటలలోపు హాజరు నమోదు పూర్తి కావాలని, విధులకు సుదీర్ఘకాలంగా హాజరుకాని సిబ్బంది వివరాలను మిగతా 9లో..



## వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- **కుటుంబానికి సమయాన్ని కేటాయించాలి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రిటైర్డ్ ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, కుటుంబానికి సమయాన్ని కేటాయించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు కర్తవ్యనిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హాజరై రిటైర్డ్ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలు అత్యంత కఠినమైనవని, కుటుంబ సౌకర్యాలను పక్కనబెట్టి సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయడం పోలీస్ సిబ్బంది ప్రత్యేకత అని పేర్కొన్నారు. అనేక ఒత్తిడులు, సవాళ్ల మధ్య విధులను సమర్థవంతంగా నిర్వహించిన రిటైర్డ్ అధికారుల మిగతా 9లో..

# రాంనగర్‌లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**చిట్యాల, జూన్ 30(జనం సాక్షి )** మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీలో మంగళవారం, ఉదయం పోలీసులు 'కార్డాన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీఐ దగ్గు మల్లేష్ ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రామ్ నగర్ కాలనీని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, ప్రతి ఇల్లులని వీధులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న 20 ద్విచక్ర వాహనాలను జప్తు చేసి, వాటి యజమానులకు ఫైన్ విధించారు. కాలనీలో అక్రమ మద్యంపై జరిగిన తనిఖీలలో ఓర్సు సరమ్మ అనే మహిళ వద్ద లభ్యమైన 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, ఆమె పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. సమాజంలో నేరాల నియంత్రణకు, ప్రజల్లో అభద్రతా భావాన్ని తొలగించడానికే ఈ తనిఖీలు చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. పలు కీలక అంశాల పై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణికులు నిబంధనలు పాటించాలని, ప్రమాదం జరిగిన మొదటి గంట లో బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు ఫోన్లకు వచ్చే ఓటీపీలు, లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.నేరాల నియంత్రణలో నిందితులను త్వరగా పట్టుకోవడంలో సీసీటీవీ మూడో కన్నులా పని చేస్తాయని, ప్రతి వీధిలో వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలు, (డ్రగ్స్ ,గంజాయి వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సిఐ కోరారు. క్షణికానందం కోసం చట్టవ్యతిరేక పనులు చేస్తూ జీవితాలను పాడుచేసుకోవద్దని, ఎలాంటి చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని యువతకు దిశా నిర్దేశం చేశారు. కాలనీల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సిఐ, మల్లేష్ కోరారు. ఈ తనిఖీల్లో చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్, ఎస్ఐ-2 రజన్ కుమార్, కానిస్టేబులు లాల్ సింగ్, రంజిత్, సందీప్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లెక్సీ కులగోట్టిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి- పుల్ల మల్లయ్య




**చిట్యాల,జూన్ 30(జనం సాక్షి ):** మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘనపూర్ మండలంలోని గాంధీనగర్ వద్ద జరిగిన సంఘటనను నిరసిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.భూపాల పల్లి – పరకాల మెయిన్ రోడ్ గాంధీనగర్ కూడలి జంక్షన్ వద్ద ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం వేసుకున్న ఫ్లెక్సీ ,కటౌట్, ఎస్సీ ఎస్టీ బీసీ బహుజనులు ఏర్పాటు చేసుకోగా అహంకారంతో ట్రాక్టర్ తో ఢీ కొట్టి పడేసి అవమానపరిచిన మంకు శ్రీకాంత్ ను తక్షణమే అరెస్టు చేయాలని, వారిపై దేశద్రోహి గా పరిగణించి శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, బీసీ, ఎస్సి, ఎస్టీ జేఏసీ భూపాలపల్లి జిల్లా నాయకులు పుల్ల అశోక్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నటువంటి సంఘటనల దోషులను కఠినంగా శిక్షించకపోవడం వాళ్లనేఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీ కులగొట్టిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, దేశద్రోహం కేసు నమోదు చేసి ,వెంటనే అరెస్టు చేసి రిమాండ్ పంపియాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వమే చూడాలని అన్నారు. లేనియెడల దశలవారిగా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగంధర్, మండల నాయకులు గురుకుంట్ల కిరణ్, బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు చిలుముల కృష్ణ, పర్లపల్లి వంశీ, బొడ్డు పాల్ చరణ్, గిన్నారపు కుమార్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించిన సెక్యూరిటీగార్డులు



**మల్హర్, జూన్30 (జనంసాక్షి)** రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో ఎయిమ్స్ యాజమాన్యం రోజుకు రూ.400 చొప్పున ఇస్తున్న వేతనం సరిపోక కుటుంబ పోషణ భారంగా మారిందని సెక్యూరిటీ గార్డ్స్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆరోపించారు.కార్మిక లేబర్ యాక్టు ప్రకారం కనీస వేతనం నెలకు రూ.18 వేలు ఇవ్వాలని గత మూడు రోజులుగా తాడిచెర్ల ఓసిపిలో విధులు నిర్వహిస్తున్న 150 మంది సెక్యూరిటీ గార్డులు విధులు బహిష్కరించి ఓసిపి గేట్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడారు తాము ఏడు సంవత్సరాలుగా ఎయిమ్స్ యాజమాన్యానికి వెట్టి చాకిరి చేస్తున్నా తమను ఎయిమ్స్ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని ప్రశ్నించిన పదిమంది గార్డులపై కక్ష్య సాధింపుగా విధుల నుంచి తొలగించారని వాపోయారు.ఏడేళ్లలో ఇప్పటికి దాదాపు 20 మంది గార్డులను తొలగించి, రూ.30 నుంచి రూ.40 వేల వరకు తీసుకొని కొత్తవారిని పెట్టుకోవడం జరిగిందని ఆరోపించారు.తొలగించిన ఎనిమిదిమంది గార్డులను విధుల్లోకి తీసుకొని,కనీస వేతనాలు అమలు చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు..

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి




**తొర్రూరు, జూన్ 30 ( జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మడిపల్లి సర్పంచ్ నలుగురి రామలింగం కోరారు. సోమవారం మండలంలోని మడిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బాలల సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందుతుందన్నారు. నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమలత,పాఠశాల హెచ్ఎం సురేందర్,ఉప సర్పంచ్ కొండం మధుశా, వార్డు సభ్యులు రామ్మూర్తి, యాకన్న, సారయ్య,ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు,విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్ట్




**రామకృష్ణా పూర్, జూన్30(జనంసాక్షి):** బొక్కలగుట్ట గ్రామంలో జరిగిన హత్య నేరంలో నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు మందమర్రి సీఐ పర్స రమేష్ తెలిపారు. పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొక్కలగుట్ట గ్రామానికి చెందిన గజ్జి వెంకటేష్(38) ను అదే గ్రామానికి చెందిన ఒడ్డేపల్లి రాజకుమార్ కుటుంబ తగాదాలు, వ్యక్తిగత కక్షతో సిమెంటు రాయితో బాది హత్య చేసిన ఘటనలో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు రాజ్ కుమార్ కోసం గాలిస్తున్న సమయంలో కుర్మపల్లి స్టేజి వద్ద అనుమానాస్పద స్థితిలో ఉన్న రాజకుమార్ ను అరెస్టు చేసి విచారణ జరుపగా హత్యనేరం ఒప్పుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ బృందాన్ని అభినందించారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్సై శ్రీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ఆహార విక్రయ కేంద్రాలపై కఠిన చర్యలు కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్, జూన్ 30:** జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, ఆహార విక్రయ కేంద్రాలు తప్పనిసరిగా ఆహార భద్రతా నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన ముడి పదార్థాలనే వినియోగించాలని, గడువు ముగిసిన లేదా నాసిరకం ఆహార పదార్థాల విక్రయం, నిల్వపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆహార భద్రత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి నాణ్యతా ప్రమాణాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ శిక్షణ పొందిన అంగన్వాడీ టీచర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈకార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

## రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ మెడలో చైన్ అపహరణ

**వరంగల్ ఈస్ట్, జూన్ 30(జనం సాక్షి)** వరంగల్ నగర సమీపంలోని మామునూరులో ఓ హెడ్ కానిస్టేబుల్ మెడలో చైన్స్ మ్యాచింగ్ జరిగిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. మామునూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మామునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ గుండు నాగభూషణ్ ఉదయం తన ఇంట్లో జరిగిన శుభకార్యానికి సంబంధించిన వ్యవహారంలో ఇంటి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తీసుకెళ్లి మామునూరు ఎయిర్పోర్ట్ సమీపంలో వేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఖమ్మం ఎటు వెళ్లాలి అని సదర్ హెడ్ కానిస్టేబుల్ నాగభూషణం అడిగారు. ఇంతలో ఆ వ్యక్తి మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు చైన్‌ను అపహరించారు. వారు కారులో వరంగల్ వైపు వెళ్లనట్లు బాధితుడు తెలిపాడు . బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చేపట్టినట్లు మామునూరు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా...

- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- వైద్య సేవలు అందుబాటులో లేక గ్రామస్తుల ఇబ్బందులు



**నల్లబెల్లి, జూలై 29 (జనంసాక్షి):** గ్రామీణ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు పల్లె దావఖానాలను ఏర్పాటు చేశాయి. కానీ మండలంలోని నారక్కపేట పల్లె దవాఖాన మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. సంవత్సరాల కొద్దీ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పల్లె దవాఖానా అందుబాటులోకి రాక వైద్య సేవలు గ్రామస్తులకు అందని ద్రాక్ష లాగా మిగిలిపోయింది. ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ఐదు వేల జనాభాకు ఒక్క పల్లె దవాఖానా చొప్పున మండలంలో మొత్తం తొమ్మిది పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. నల్లబెల్లి, లెంకాలపల్లి, రేలకుంట, ముచ్చింపుల, కన్నరావుపేట, గోవిందాపూర్, రాంపూర్, రుద్రగూడెం గ్రామాలలోని పల్లె దవాఖానాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ నారక్కపేట గ్రామంలో మాత్రం పల్లె దవాఖానా ప్రారంభం కాలేదు. దీంతో వైద్య సేవలు గ్రామస్తులకు అందుబాటులో లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లెదవాఖానా పనులను పూర్తి చేసి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## వానాకాలం రైతు భరోసా పథకం అమలుకు మార్గదర్శకాలు జారీ

### జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల



**వరంగల్ ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి):** వానాకాలం - 2026 సీజన్లో రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసినట్లు వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల తెలిపారు. ఈ సీజన్‌లో 1,671 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పథకానికి అనుసంధానం చేయబడ్డాయని ఆమె తెలిపారు. ఈ కొత్త పాస్ పుస్తకాలు కలిగిన రైతులు తమ సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ను సంప్రదించి బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయించుకోవాలని అన్నారు. ఇప్పటికే రైతు భరోసా పథకం కింద ఆర్థిక సహాయం పొందుతున్న ప్రస్తుత పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు బ్యాంకు ఖాతా మార్పు లేదా ఇతర వివరాల్లో సవరణ అవసరమైతే మాత్రమే బ్యాంకు వివరాలను సమర్పించాలని కోరారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించని ప్రస్తుత పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు కూడా తమ సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి బ్యాంకు వివరాలను నమోదు చేయించుకోవాలి. బ్యాంకు వివరాల నమోదు కోసం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించే రైతులు ఈ క్రింది పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. దరఖాస్తు పత్రం. ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతి. బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతి. బ్యాంకు వివరాల నమోదుచివరి జులై ఏడో తేదీ లోపున సమర్పించాలని కోరారు. వరంగల్ జిల్లా రైతులందరూ పై సూచనలను గమనించి, నిర్ణీత గడువులోగా అవసరమైన వివరాలను నమోదుచేయించుకొని రైతు భరోసా పథకం ప్రయోజనాలను జిల్లాలోని రైతాంగం పరులైన రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల కోరారు.

## ఉద్యోగులు ఉత్తమ సేవలు అందిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు

- నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్, ఇన్చార్జి ఎంపీడీవో ఆయేషా పర్వీన్



**చెన్నారావుపేట, జూన్ 30( జనం సాక్షి):** ప్రభుత్వ ఉద్యోగులు గ్రామాలలోని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్, చెన్నారావుపేట ఇన్చార్జి ఎంపీడీవో ఆయేషా పర్వీన్ లు అన్నారు. మంగళవారం మండలంలోని అక్కల్ చెడ గ్రామపంచాయతీ కార్యదర్శి తిప్పని చేరాలు ఉద్యోగ పదవీ విరమణ సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పని చేరాలు పంచాయతీ కార్యదర్శి గా 35 సంవత్సరాల పాటు వివిధ గ్రామాలలో పనిచేస్తూ అనేక సేవలు అందించారన్నారు. ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చేరాలుకు పదవి విరమణకు సంబంధించిన బెనిఫిట్స్ పత్రాలను పదవి విరమణ రోజే ముందస్తుగా ఇన్చార్జి ఎంపీడీవో ఆయేషా పర్వీన్ అందించారు. అనంతరం తిప్పని చేరాలు- రమాదేవి దంపతులకు మెమొంటోలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి తండ జగదీష్, అక్కల్ చెడ గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, గ్రామ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, మహమ్మద్ ఖయాజ్, ఏపీఓ అరుణ, ఈసీ కిషోర్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నరేందర్, జూనియర్ అసిస్టెంట్లు అనిల్ కుమార్, షాదాబ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు గొడిశాల వికాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కత్తెరపల్లి రాజు, గౌరవ అధ్యక్షులు మహమ్మద్ షాహెద్ పాషా, కోశాధికారి ప్రియాంక, ఉపాధ్యక్షురాలు ఉష, జాయింట్ సెక్రెటరీ ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు సుప్రజ , శ్యాం ప్రసాద్, మహేష్, రవి, అనిత, కృష్ణంరాజు, కల్పన, కళ్యాణి, సంతోష్, మల్లికార్జున్, రాంబాబు, జ్యోతి, శ్రీదేవి, స్వప్న, చిత్తరంజన్, అనిల్, భరత్, కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, ప్రణవ్, సందీప్, ఆఫీస్ సబార్డినేట్ నీల, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో దళితులను చిన్న చూపు చూడవద్దు...

### డిప్యూటీ తహసిల్దార్ ఇంజమూరి పవన్




**చెన్నారావుపేట, జూన్ 30 ( జనం సాక్షి):** గ్రామాల్లోని దళితులను చిన్నచూపు చూడవద్దని డిప్యూటీ తహసిల్దార్ ఇంజమూరి పవన్ అన్నారు. మంగళవారం మండలంలోని జల్లి గ్రామంలోని గ్రామపంచాయితీ ఆవరణలో గ్రామ సర్పంచ్ యాట సుధాకర్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ఉన్న దళితులను మిగతా కులాలకు చెందిన వారు అంటరాని వారిగా చూడవద్దన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానమేనని ఒకవేళ చిన్న చూపు చూసినట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. చిన్న చూపు చూసిన వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అంటరానితనం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిని సరోజ , మండల పశువైద్యాధికారి వెంకటరాజు, ఏపీఓ అరుణ, గ్రామ ఉపసర్పంచ్ మెరుగు బాబు, అదనపు గిర్దావర్ మమత, ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి మల్లమ్మ, జూనియర్ అసిస్టెంట్ అంజద్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుర్తి విజయ్ కుమార్, గడ్డం సుభద్ర, గ్రామపంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఉద్యోగ జీవితంలో సహజమైన ఘట్టం



**నెరడిగొండ జూన్30(జనంసాక్షి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితంలో సహజమైన ఘట్టమని,అయితే ప్రజలకు అందించిన సేవలు మాత్రం చిరస్థాయిగా గుర్తుండిపోతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. మంగళవారం రోజున మండల కేంద్రంలో ని సూర్య గార్డెన్లో నిర్వహించిన ఎంపీడీఓ శేఖర్ పదవి విరమణ మహోత్సవ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎంపీడీఓ శేఖర్ అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలను నిజాయితీగా, అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని,సమాజానికి సేవ చేసే అవకాశాలకు ముగింపు కాదని అన్నారు. భవిష్యత్తు జీవితంలో ఆయురారోగ్యాలతో,కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తూ ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మండల అధికారులు వివిధ శాఖల ఉద్యోగులు సిబ్బంది ప్రజలు పాల్గొని పదవీ విరమణ పొందిన ఎంపీడీఓను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

# క్యాన్సర్ ప్లేట్ వద్దు.. హెల్త్ ప్లేట్ ముద్దు

## కుంటాల పంచాయతీ కార్యదర్శి రాజా బాపు




**కుంటాల, జూన్ 30(జనం సాక్షి):** “నా ఆరోగ్యం -- నా బాధ్యత, నా పర్యావరణం - నా కర్తవ్యం” అనే నినాదంతో కుంటాల గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కుంటాల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజా బాపు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి అందరికీ తెలిసినా, ఇంకా ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగడం, ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనం చేయడం, కూరగాయలు మరియు ఇతర వస్తువులను ప్లాస్టిక్ కవర్లలో తీసుకురావడం కొనసాగుతుండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులలో వేడి పదార్థాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ఇంటి చెత్తను ప్లాస్టిక్ సంచుల్లో వేసి కాలువలు, డ్రైనేజీలు, ఖాళీ స్థలాల్లో పడేయడం వల్ల పర్యావరణం తీవ్రంగా కలుషితమవుతోందని, రోడ్లపై పడేస్తున్న ప్లాస్టిక్ కవర్లను ఆహారమని భావించి పశువులు, పక్షులు తిని ప్రాణాలు కోల్పోతున్నాయని, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కాలువలు మూసుకుపోయి నీటి నిల్వలు ఏర్పడుతున్నాయి. దీనివల్ల దోమలు చేరి గ్రామంలో వ్యాధులు వ్యాపించే ప్రమాదం పెరుగుతోంది. ఈ సందర్భంగా రాజా బాపు మాట్లాడుతూ, తాను ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లకు దూరంగా ఉంటూ కేవలం స్టీల్ పాత్రల్లోనే భోజనం చేస్తున్నానని తెలిపారు. గ్రామ ప్రజలంతా కూడా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పునర్వినియోగ స్టీల్ పాత్రలను ఉపయోగించాలని కోరారు. మనం చేసే ఈ “చిన్న మార్పే, స్వచ్ఛమైన గ్రామం -ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పెద్ద అడుగు” అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వాడే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఒక వర్గానికి కొమ్ముకాస్తున్న మున్సిపల్ పాలక వర్గం

## సీనియర్ నాయకులు రావుల రాంనాథ్



**నిర్మల్ టౌన్ , జూన్ 30,, (జనంసాక్షి)** నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్‌లో ఒక వర్గానికే కొమ్ము కాసేలా నిర్ణయాలు తీసుకొని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని పార్టీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, పట్టణ బీజేపీ నాయకులు సాధం అరవింద్ లు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. 42 వార్డులలో నెలకొన్న అనేక సమస్యలను పక్కన బెట్టి కేవలం మైనారిటీ వర్గానికి కొమ్ముకాసేలా ఎజెండా లు రూపొందించడం సరికాదన్నారు. బక్రీద్ పండగ కు సంబంధించి బిల్లులు ఆమోదం తీసుకోవడం కోసం, మరియు నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాదాస్పదంగా మారిన ఈద్గా అభివృద్ధి కొరకు మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి 50లక్షలు కేటాయించడం కొరకు కౌన్సిల్ ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అనేక కాలనీల్లో రోడ్ల పైకి నీరు చేరుతుందని ఇటువంటి అత్యవసర పనుల గురించి దృష్టి సారించాలని, కేవలం మైనారిటీల కోసం ప్రజాధనాన్ని కేటాయించి హిందువులకు అన్యాయం చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. ఒకవైపు అనేక కాలనీల్లో రోడ్లు డ్రైనేజ్ లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేవలం రియలేస్టేట్ దందా కోసం 21 వ వార్డ్ లో జన నివాసాలు లేకున్నప్పటికీ 50 లక్షలతో డ్రైన్ కు కేటాయించడం సరికాదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులతో అన్ని వార్డ్ లలో సమానంగా అభివృద్ధి పనులకు కేటాయించాలని హితవు పలికారు. తక్షణమే కౌన్సిల్ లో పేర్కొన్న హిందూ వ్యతిరేక ఎజెండా లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రానున్న రోజుల్లో తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, సాదం అరవింద్, కౌన్సిలర్లు శ్రీరామోజీ నరేష్, జింక సూరి, కూన శశాంక్, విఠల్, సాత్విక్, ముత్యం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మానవతా దృక్పథంతో అండగా నిలిచిన జిల్లా కలెక్టర్

- అంగవైకల్యుడికి టాటా ఏసీ వాహనం మంజూరు



**జనగామ ప్రతినిధి,జూన్ 30(జనంసాక్షి):** అంగవైకల్యంతో బాధపడుతున్న పర్శ సాయి కుటుంబానికి జీవనోపాధి కోసం టాటా ఏసీ వాహనం మంజూరు. రూ. 4 లక్షల చెక్కును తల్లిదండ్రులకు అందజేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. అంగవైకల్యంతో బాధపడుతున్న జనగామ పట్టణానికి చెందిన పర్శ సాయి కుటుంబానికి శాశ్వత జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి మానవతా దృక్పథంతో స్పందించి టాటా ఏసీ వాహనం మంజూరు చేయించారు. ఇందుకోసం రూ. 4 లక్షల విలువైన చెక్కును మంగళవారం, కలెక్టర్ కార్యాలయంలో పర్శ సాయి తల్లిదండ్రులకు లిజిల్లా కలెక్టర్‌లి అందజేశారు. ఇటీవల పర్శ సాయి తల్లిదండ్రులు తమ కుటుంబ పరిస్థితిని వివరిస్తూ, జీవనోపాధి కోసం సహాయం చేయాలని లిజిల్లా కలెక్టర్‌లి ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని, అంగవైకల్యం కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, టాటా ఏసీ వాహనం మంజూరుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మా ట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లక్ష్యం.. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి వారి జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమేనని అన్నారు. అందిస్తోన్న ఈ టాటా ఏసీ వాహనాన్ని సద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందాలని, వాహనం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. వాహనం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇంటి ఖర్చులు, కుటుంబ అవసరాలు, పర్శ సాయి సంరక్షణ కోసం వినియోగించుకోవాలని కలెక్టర్సూ చించారు. జిల్లా కలెక్టర్ అందించిన ఈ సహాయంపై పర్శ సాయి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ వినతికి వెంటనే స్పందించి, జీవనోపాధి కల్పించిన లికలెక్టర్‌లి కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కుబీర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్



**కుబీర్, జూన్ 30, (జనంసాక్షి):** కుబీర్ మండల నూతన ఎంపీడీవోగా అక్కలదేవి శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సాగర్ రెడ్డి బదిలీ కావడంతో ప్రభుత్వం శ్రీనివాస్‌ను ఇక్కడికి నియమించింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్యాలయ సిబ్బందితో కలిసి మండల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవోకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాణ్యమైన వైద్య సేవలను అందించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల తనిఖీ



**వరంగల్ బ్యూరో, జూన్ 30(జనం సాక్షి)** ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను జిల్లా కలెక్టర్ డా.సత్య శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీలో సంబంధిత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి ఎస్ కె ధర్మరాజ్ ,ఆయుర్వేదిక కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అనసూర్య,వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**నల్లబెల్లి, జూన్ 30 (జనంసాక్షి):** పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన కందకట్ల కిరణ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మాధవరెడ్డి ఆర్థిక సహాయం కింద రూ.2 లక్షల 50 వేలు మంజూరు చేసి ఎల్ ఓసి ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశాడు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వడ్లూరి రమేష్, కుటుంబ సభ్యులు కందకట్ల రాజ్ కుమార్, రాకేష్ పాల్గొన్నారు.

# గో టూ విలేజీ ప్రోగ్రాం...




**నూగూర్ వెంకటాపురం జూన్ 30(జనం సాక్షి ):-** మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ఎమ్మార్పిస్ యాసం రమేష్ మాదిగ ఆధ్వర్యంలోమాదిగ రిజర్వేషన్ పై దండోరా పోస్టర్ నివిడుదల చేశారు.ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు పుల్లూరు కరుణాకర్ మాదిగ అధ్యక్షతన జులై 7న ఎమ్మార్పిస్ ఆవిర్భవ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా జరుపుకోవాలి అన్నారు. ఎమ్మార్పిస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ జాతికి అందించారని తెలిపారు. విద్యా ఉద్యోగాల్లో ముందుకు రావాలిఅన్నారు.అనంతరం ములుగు జిల్లా ఇంచార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఛతలా రమేష్ మాట్లాడుతూ.. మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్స్ ని తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మార్గనిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొందించడం కోసం ఎమ్మార్పిస్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు గో టు విలేజ్ ప్రోగ్రాం చేపట్టినట్లు తెలిపారు . యువకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న ఎమ్మార్పిస్ ఉద్యమం 32 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెలని నిర్మాణం చేసుకోవాలని కోరారు.జులై 7 న మాదిగ జాతి పండుగగా ఎమ్మార్పిస్ జెండా పండుగ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఏలుపుల మల్లేష్ మాదిగ,ఎమ్మెస్ పి మండల అధ్యక్షులు కొడారి సత్యం మాదిగ,చెన్నం గౌతం మాదిగ,గుగ్గిళ్ళ కళ్యాణ్ మాదిగ,బోట్ల వంశి మాదిగ, చెన్నం దివాకర్ మాదిగ, బొంతల వెంకటేశ్వర్లు మాదిగ,తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ అధికారులకు సహకరించండి



**నల్లబెల్లి, జూన్ 30 (జనంసాక్షి):** ఏనుమరేషన్ పారాలను పంపిణీ చేసే బూత్ లెవెల్ అధికారులకు మండల ప్రజలు సహకరించాలని తహసిల్దార్ ముప్పు కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కన్నరావుపేట, బుచ్చిరెడ్డి పల్లి గ్రామాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపడుతున్న బూత్ లెవెల్ అధికారుల పనితీరును అతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎనుమరేషన్ పారాల పంపిణీ, పారాల పూరించే విధానాన్ని పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఓటర్లందరూ ఎనమరేషన్ పారాలను బూత్ లెవెల్ అధికారుల సూచన మేరకు పూరించి వారికి అందచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ మంతెన అజయ్ రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

### సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి అహల్య



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 30 ( జనం సాక్షి ) :** మండలంలోని ఇప్పగూడెంగ్రామ పూర్వ సర్పంచ్, సీపీఎం నాయకులు కామ్రేడ్ మంతెన అజయ్ రెడ్డి 5వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం గ్రామ సిపిఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు.ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యురాలు ఇర్రి అహల్య మాట్లాడుతూ, కామ్రేడ్ మంతెన అజయ్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారం కోసం, గ్రామఅభివృద్ధి కోసం,ప్రజాసేవ కు అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, విలువలను నేటి తరం కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గట్ల మల్లారెడ్డి, లింగనబోయిన రాజు, పోలాసు కిష్టయ్య, సట్ల రాజు, యన్ రాంరెడ్డి,దైద కుమార్,పోలాసు పద్మాకర్, బొంకురి రామచంద్రం,తిరుపతి, కోలిపాక వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పతనం అవుతున్న సామ్రాజ్య వాద కార్పోరేట్ ఆర్థిక వ్యవస్థ

- సోషలిస్టు ఆర్థిక వ్యవస్థే సకల సమస్యలకు పరిష్కారం.
- యంసిపిఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్.




**వరంగల్ ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి):** నేటి ప్రపంచ పరిణామాలు పరిశీలిస్తే సామ్రాజ్య వాద కార్పోరేట్ ఆర్థిక వ్యవస్థ దానికి నేతృత్వం వహిస్తున్న అమెరికా నాయకత్వం లోని పెట్టుబడి దారీ దేశాలు పతనం అవుతున్న తీరు ప్రపంచం ముందు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ మాత్రమే సరైన ప్రత్యామ్నాయం అని ఋజువు చేస్తున్నాయి అని యంసిపిఐ (యు) అఖిలభారత ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం ఓంకార్ భవన్ అండర్ బ్రిడ్జి వరంగల్ యంసిపిఐ(యు) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో అశోక్ మాట్లాడుతూ అమెరికా ఇరాన్ పై ఇజ్రాయెల్ తో కలిసి యుద్ధ దాడులు చేసి వేలాది మంది మరణానికి కారణం అవుతూ, ప్రపంచ లో ఆర్థిక వ్యవస్థ కుదేల్ అయి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పర్యావరణం దెబ్బ తిని వాతావరణ సమతుల్యత లోపిస్తుంది, ఇరాన్ ను. లొంగదీసు కోవాలని అమెరికా చేసిన కుయుక్తులు దెబ్బ తిని ప్రపంచం ముందు తలవంచుకుని నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. ఈ పరిస్థితుల్లో అలీన విధానం ను కోల్పోయి సామ్రాజ్య వాద అమెరికా ముందు మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తలవంచుకుని విధించిన ఆంక్షలను అమలు కు పూనుకోవడం సిగ్గు చేటు అని అన్నారు. దేశంలో అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీస్తుంది అని దేశం లో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తుందని, పౌరసత్వం ను రద్దు చేసే కుట్ర లో నే "సర్" పేరు తో ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టింది అని ఇది పెద్ద కుట్ర అని ప్రజాస్వామ్య వ్యవస్థను కూని చేసే చర్య అని అన్నారు. ఈ ప్రత్యేక పరిస్థితుల్లో దేశంలో కమ్యూనిస్టు వామపక్ష శక్తులు ఐక్యం కావడం తప్ప మరో మార్గం లేదని అందుకు అనుగుణంగా యంసిపిఐ(యు) కృషి చేస్తుంది అని అన్నారు.గత ఎనిమిది సంవత్సరాలుగా యంసిపిఐ(యు) లో భిన్నాభిప్రాయాలు కలిగి విడివిడిగా పని చేస్తున్న నాయకత్వం జూన్ 29 వ తేదీన వరంగల్ నగరం లో ఏకీకరణ నిర్మాణ రాష్ట్ర సదస్సు జరిగిందని ఈ సదస్సులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా గాదగోని రవి ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.23 మంది రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గా,70 మందితో రాష్ట్ర కార్యదర్శి ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది.ఈ సమావేశం లో నూతన రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి.పార్టీ పోలిట్బ్యూరో సభ్యులు వల్లెపు ఉపెందర్ రెడ్డి, మోర్తాల చందర్ రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సింగతి సాంబయ్య,పెద్దారపు రమేష్, యన్ రెడ్డి హంసా రెడ్డి, కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు నర్రా ప్రతాప్,కర్ర రాజిరెడ్డి, మాలోతు సాగర్, మాస్ సావిత్రి, ముక్కెర రామస్వామి తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి భరోసాగా నిలిచిన బిఆర్ఎస్ నాయకులు

### సహాయం అందిస్తున్న టిఆర్ఎస్ నాయకులు



**దుగ్గొండి, జూన్ 30(జనంసాక్షి):** దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామనికి చెందిన నీరటి వేణు గత కొద్దీ రోజుల కింద రోడ్డు యాక్సిడెంట్ లో మృతి చెందగా మృతుని కుటుంబానికి స్థానిక టిఆర్ఎస్ నాయకులు ఆర్థిక సహాయ అందజేశారు మంగళవారం బాధిత కుటుంబానికి భరోసాగా నిలిచిన బి ఆర్ ఎస్ నాయకులు మృతుని కుమార్తె మనస్విని పేరు మీద 25 వేల రూపాయలు బ్యాంకులో పిక్స్ డిపాజిట్ చేశారు, అట్టి పాసుబుక్కు మృతిని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, మాజీ సర్పంచ్ ఉమ్మడి యుగేందర్, ఉప సర్పంచ్ పొన్నం వంశీ , వార్డు మెంబర్ తౌటు విజయ రవి, ఇజ్జగిరి రాజన్న, ఇజ్జగిరి మమత రంజిత్, ఇసం పెల్లి సులోచన సుమన్ , మాజీ ఎంపీటీసీ రంపిస సోనీ రతన్ ,మాజీ ఉపసర్పంచ్ షానబోయిన నరసింహా స్వామి, మాజీ వార్డ్ మెంబర్ కానుగుల రాంబాబు,బి ఆర్ ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సొల్లేటి కొమరారెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షులు నీరటి మురళి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంద శ్రీను, యూత్ అధ్యక్షులు జన్ను మనోజ్ ,సీనియర్ నాయకులు కానుగుల రమేష్ , సింగన బోయిన రవి,లకిడె మోహన్, మట్టేవాడ పవన్, ఇమ్మడి రాజన్న, కట్టయ్య , తదితరులు పాల్గొన్నారు

## ఎంపీడీవో అబ్దుల్ హైకి సన్మానం



**నెన్నెల జూన్ 30 (జనం సాక్షి)** నెన్నెల మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) అబ్దుల్ హై పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి, ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలేటి సంధ్యారాణి, డీసీసీ కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, నాయకులు మల్లగౌడ్, వంశీ, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్ పై అవగాహన కల్పించి ఫామ్స్ నింపిన బిజెపి నాయకులు




**తాండూర్, జూన్ 30(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : తాండూర్ మండలంలోని 123 పోలింగ్ బూత్ పరిధిలో ఫ్రెష్ మిల్క్ సెంటర్ స్థానిక బిజెపి నాయకులు సర్ పై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించి వారి యొక్క ఇమ్యునరేషన్ పత్రాలను నింపారు.స్థానిక బి ఎల్ వో సుజాత తో కలసి బిజెపి బెల్లంపల్లి నియోజకవర్గ బిఎల్ఏ 1 పులగం తిరుపతి,మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల సోషల్ మీడియా కన్వీనర్ కామెర మహేష్ లు నిరక్షరాశులకు అవగాహన కల్పించి వారి పత్రలను నింపి సర్ విషయమై పూర్తి అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉంటుందని ఎవరు అధైర్యపడవద్దని తెలిపారు. సర్ పై కాంగ్రెస్ బిఆర్ఎస్ ఇతర రాజకీయ పార్టీలు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నాయని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికా వద్దని తెలిపారు స్థానిక బి ఎల్ ఏ ఓ,బి ఎల్ ఏ 1 లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పలిమెల గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాత్కాలిక కంచె ఏర్పాటు



**(పలిమెల జూన్ 30 జనం సాక్షి )** జయశంకర్భూపాలపల్లి జిల్లా, పలిమెల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో నిత్యం పశువులు (ఆవులు, గేదెలు), కుక్కలు లోపలికి చొరబడి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీనివల్ల ప్రతిరోజూ ఉదయాన్నే పంచాయతీ కార్మికులు కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఫలితంగా గ్రామ వీధులను, వార్డులను శుభ్రం చేయడానికి వారికి సమయం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి వినూత్నంగా ఆలోచించారు. కార్మికుల సమస్యను దృష్టిలో ఉంచుకుని, మూగజీవాలు లోపలికి రాకుండా ఉండేందుకు పంచాయతీ ఆవరణ చుట్టూ తాత్కాలికంగా దడి (కంచె) కట్టించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆమె స్వయంగా దగ్గరుండి మరీ ఈ కంచె ఏర్పాటు పనులను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలత తిరుపతి మాట్లాడుతూ... ప్రహరీ గోడ లేకపోవడం వల్ల పంచాయతీ ఆవరణ అపరిశుభ్రంగా మారుతోందని, కార్మికులు ఇక్కడ శుభ్రం చేయడానికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పుడు తాత్కాలిక కంచె ఏర్పాటు చేయడం వల్ల మూగజీవాల బెడద తప్పుతుందని, కార్మికులకు సమయం కలిసివచ్చి వారు గ్రామ వీధుల పారిశుధ్యంపై అదనపు సమయం కేటాయించడానికి వీలవుతుందని ఆమె పేర్కొన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించిన సర్పంచ్ చొరవను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ కృషి




**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 ( జనం సాక్షి ) :** అంగవైకల్యాన్ని పక్కనపెట్టి ఆత్మవిశ్వాసమే లక్ష్యంగా చిల్పూర్ మండలంలోని సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తూ అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుం దని గ్రామస్తులు తెలిపారు. రాజకీయాలను పక్క నపెట్టి ప్రజాసేవ లక్ష్యంగా ఏ పేదవారికి ఆపద వచ్చిన నేనున్నాను అని వారి సమస్యల పరిష్కారానికి సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ కృషి చేస్తున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ జనం సాక్షితో మాట్లాడుతూ తన సోదరుడు ఇల్లందుల సుదర్శన్ సహకారంతో గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని అన్నారు. చిన్న పెండ్యాల గ్రామా న్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ వెల్లడించారు. ప్రజలందరి సహకారంతో మహిళా నాయకత్వానికి ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్ తిరుపతమ్మ, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేసి మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరుస్తున్న మోడీ ప్రభుత్వం



**నర్సంపేట జూన్ 30 ( జనం సాక్షి)** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసి ఆ చట్టంలోని కూలీల ప్రయోజనాలను బలి చేస్తూ కొత్తగా అనేక సవరణలతో వి బి జి రామ్ జి చట్టాన్ని తీసుకురావడం వెనకాల రాబోయే రోజుల్లో ఈ చట్టాన్ని ఎత్తివేయడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం వేసిన పన్నాగమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య. అన్నారు మంగళవారం నర్సంపేట మండలం ఇటుకల పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని రోజురోజు నీరు కారుస్తూ బలహీనపరుస్తూ గతంలో లక్షల కోట్లల్లో ఆ పనులకు నిధులు కేటాయిస్తే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేల కోట్లల్లో మాత్రమే నిధులు కేటాయిస్తూ ఆ నిధులను కూడా సరైన పద్ధతిలో ఖర్చు చేయకపోవడం కూలీలకు సరైన పని కల్పించకపోవడం దినసరి వేతనాలు పెంచినా కూడా అవి అమలు కాకపోవడం ఇవన్నీ చూస్తే ఈ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తుందని వాస్తవంగా కనిపిస్తుందని ఆయన అన్నారు ఉపాధి హామీ చట్టంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు తమ వాటాలుగా బడ్జెట్లో కేటాయించారని గత ప్రభుత్వం కేంద్రం 90 పైసలు ఇస్తే రాష్ట్రం 10 పైసలు ఇచ్చేదని దాన్ని పూర్తిగా రద్దు చేసి రాష్ట్రం 40 పైసలు కేంద్రం 60 పైసలు ఇచ్చే కొత్త పద్ధతిని తీసుకువచ్చి అది కూడా రాష్ట్రాలు ఖర్చు చేయకుంటే డబ్బులు ఇవ్వడం కుదరదు అంటూ కేంద్ర ప్రభుత్వం కూలీలకు మొండి చేయి చూపుతుందని అందులో భాగంగానే కూలీలకు వేతనాలు రాకపోవడం సరైన సమయంలో వేతనాలు పడకపోవడం ఇవన్నీ కూడా అనేక అంశాలు దాగి ఉన్నాయని విబిజి రాంచి చట్టాన్ని మేము అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో అది సాధ్యం కావడం లేదని ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వానికి కూలీల పట్ల వారి జీవన విధానం పట్ల కేంద్రంలోని బిజెపికి ఉన్నటువంటి విధానాలే రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయని అందుకోసం కూలీలందరూ ఒకదాటిపైకి వచ్చి ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్రంలో వలసలు పెరిగిపోతున్నాయని మన జిల్లా నుండి కూడా వేలాది సంఖ్యలో పేదలు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాల వరకు వలసలు వెళుతున్నారని అందుకని పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నటువంటి ప్రభుత్వాలు వారికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అనేక తప్పుడు పద్ధతుల్లో పరిపాలన కొనసాగిస్తూ ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు అన్నారు అందుకని రాష్ట్రంలోని దేశంలోని ప్రభుత్వాలు ఉన్నత వర్గా లకు అండదండలిస్తూ పేదవారిని పీడిస్తూ వారి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని అందుకనే ఎన్నో పోరాటాలతో సాధించకుండా ఉపాధి హామీ చట్టాన్ని పేద ప్రజలు తిరగబడి సాధించుకోవాలని అందుకోసం పథకం రద్దయి వరకు పేద ప్రజలు పోరాటాలను ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్కే అన్వర్. పెండ్యాల సారయ్య. గోనె మల్లారెడ్డి. నీరెడ్డి బాల కుమారు చిమ్మని సురేష్. మంకాల చెన్నయ్య. మచ్చిక అనిత. అనుముల రాధా. రజిత .తదితరులు పాల్గొన్నారు

## గుత్తి కోయాల గూడెంలో పల్స్ పోలియో కార్యక్రమం



**వెంకటాపూర్(రామప్ప),జూన్30(జనం సాక్షి):-** పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా మంగళవారం రోజున వెంకటాపూర్ పరిధిలో గల రవాణా సౌకర్యం లేని గుత్తి కోయాల గూడెం అయినటువంటి తొర్రి చింతలపాడు గిరిజన ఆవాసాలకు వైద్య సిబ్బంది నడక మార్గాన వెళ్లి ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన 15 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని వెంకటాపూర్ వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ శ్రీకాంత్ తెలియజేశారు.మండలంలో గుర్తించబడిన రవాణా సౌకర్యం లేనటువంటి గుత్తి కోయిల గూడాలైన రోలు బండ,బండ్లపాడు చాకిరేవులు, నందిపాడు అదేవిధంగా తొర్రి చింతలపాడు గిరిజన ఆవాసాలలో 85 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని తెలియజేశారు.మూడు రోజుల పల్స్ పోలియో కార్యక్రమంలో వెంకటాపూర్ మండల పరిధిలో గల 10,200 గృహాలను సందర్శించి వేయించుకొని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తూ మొత్తంగా మండల పరిధిలో 2438 ఐదు సంవత్సరాలలోపు వయస్సు కలిగిన పిల్లలకు పోలియో చుక్కలు వేసి 100% సాధించామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మోతిలాల్, సుశీల పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

### ప్రిన్సిపాల్ మేకల రమేష్



**చిట్యాల, జూన్ 30(జనం సాక్షి ):** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అదేవిధంగా ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపిసి,సీఈసీ గ్రూపులలో సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈ అవకాశాన్ని మండలము జిల్లా విద్యార్థిని విద్యార్థులు అందరూ తగిన ధ్రువపత్రాలతో హాజరై అడ్మిషన్ పొందగలరని ప్రిన్సిపల్ మేకల రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. మా పాఠశాల కళాశాలలో విశాలమైన గదులు కంప్యూటర్, డిజిటల్ క్లాస్ రూములు గ్రంధాలయ వసతి నాణ్యమైన విద్యను బోధించడానికి అనుభవజ్ఞులైన టీచర్స్ అమ్మాయిలకు ప్రత్యేకమైన హాస్టల్స్ సౌకర్యం కలదని అన్నారు.కావున ఇట్టి అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మండల కేంద్రంలో సర్ ప్రక్రియ కార్యక్రమం



**మహా ముత్తారం జూన్ 30 (జనం సాక్షి)** మండల కేంద్రంలో సర్ ప్రక్రియలో భాగంగా సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కొండ గొర్ల బాపు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కొన్ని వార్డులు తిరుగుతూ మాజీ ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్తులతో కలిసి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించారు. ఓటర్ల పేర్లు నమోదు చిరునామా కుటుంబ సభ్యుల వివరాలు కొత్త ఓటర్ నమోదు మరణించిన ఇతర ప్రాంతాలకు వెళ్లిన సేకరించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లింగమల శారద,దుర్గయ్య, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గడ్డం రాజబాబు, సీనియర్ నాయకులు తాటి లచ్చయ్య గౌడ్, పోలంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రామినేని వెంకటరాజశీ,వారితో పాటు సూపర్వైజర్ సాగర్, బి ఎల్ ఓ లు లింగమల్ల శ్యామల, మండల రాజు, బి ఎల్ ఏ కలవచర్ల రజాకర్, మంతెన వెంకటేష్, నాయకులు గంధం లచ్చయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాలపై ప్రజలకు ఎన్నో సందేహాలు.. స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి



**నెన్నెల, జూన్ 29 (జనం సాక్షి )** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నింపుతున్న ఫారాల విషయంలో ప్రజలకు అనేక సందేహాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 2002 ఓటరు జాబితాలో పేరు లేదా స్పెల్లింగ్ తప్పుగా నమోదై, ప్రస్తుతం అధికారికంగా సరిచేసుకున్న వారు ఫారంలో ఏ పేరు నమోదు చేయాలనే విషయంపై అయోమయంలో ఉన్నారు. అదేవిధంగా పాత రికార్డులో ఉన్న పేరునే రాయాలా? లేక ప్రస్తుతం ఆధార్, ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాల్లో ఉన్న సరిచేసిన పేరునే నమోదు చేయాలా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై బీఎల్ఓలను లేదా ఫీల్డ్‌లో తిరుగుతున్న సిబ్బందిని అడిగినా స్పష్టమైన సమాధానం రావడం లేదని పలువురు చెబుతున్నారు. యూట్యూబ్, సామాజిక మాధ్యమాల్లో ఎవరికి తోచిన విధంగా వివరణలు ఇస్తుండటంతో ప్రజల్లో మరింత గందరగోళం ఏర్పడుతోంది. దీంతో తప్పుగా ఫారాలు నింపితే ఓటు కోల్పోతామేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అందువల్ల ఎన్నికల అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫారాలను ఎలా నింపాలి, ఏ పరిస్థితిలో ఏ వివరాలు నమోదు చేయాలి, పేరు లేదా స్పెల్లింగ్‌లో మార్పులు ఉంటే ఎలా నమోదు చేయాలనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను ప్రజలకు, బీఎల్ఓలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అధికారిక సూచనలను వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ఒక్క అర్హుడైన ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రోడ్డు పనులు అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**తాండూర్, జూన్ 30(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : తాండూరు మండలం కాసిపేట నుండి గోపాల్ నగర్ ఆర్‌డబి రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డుకు ఐటిడిఏ నిధులతో మంజూరైనా తారు రోడ్డును కొందరు రోడ్డు నిర్మాణంలో తమ భూమి పోతుందని అడ్డుకుంటున్నారు. దీనిపై గోపాల్ నగర్, కాసిపేట సర్పంచ్ లు గాట్ల నర్సయ్య, ముదాం వనజ గోవర్ధన్ ఆయా గ్రామాల ప్రజలు ఎంత చెప్పిన వినకుండా వితండవాదం చేస్తూ రోడ్డుకు అడ్డంగా ముళ్ళ కంపలు వేసి అభివృద్ధిని అడ్డుకోవడంపై ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోని తారు రోడ్డు నిర్మానానికి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## టేకుమట్ల నూతన ఎంపీడీవోగా అజ్మీర వసంత రామ్



**టేకుమట్ల జూన్ 30 జనంసాక్షి** టేకుమట్ల నూతన ఎంపీడీవో గా వసంత రామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మండల పరిషత్ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో పనస అనిత కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలానికి బదిలీ కాగా ఆమె స్థానంలో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సూపరిండెంట్ గా బాధ్యతలు నిర్వర్తించి, పదోన్నతి పై మంగళవారం టేకుమట్ల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది మండలంలోని ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి



**తాండూర్, జూన్ 30(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం బలహన్పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి భానేష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు కనీస ప్రాథమిక విద్యను కూడా అందించలేని స్థితిలో సామాజిక అసమానతలు ఎందుకు గత ప్రభుత్వం బంగారు తెలంగాణ అని ప్రస్తుత ప్రభుత్వ పాలన. రైజింగ్ తెలంగాణ 2047 అని బడ్జెట్ పెట్టి కోట్లాది రూపాయలు వారికి అవసరమైన వాటి కోసం వెచ్చిస్తున్నారు తప్ప పేద విద్యార్థుల చదువులకు పాఠశాల మాత్రం చేయడం లేదు. నేడు ప్రభుత్వ పెద్దల విగ్రహాలు పెడతామని ప్రకటిస్తున్నారు తప్ప విద్యార్థులకు ఒక పాఠశాల ఏర్పాటు చేయలేకపోతున్నారు. ఇక్కడున్న పేద గిరిజన ఆదివాసి విద్యార్థులకు పాఠశాల లేక పసిప్రాయం లోనే బాల కార్మికులుగా మారుతున్నారని. పాఠశాల లేకపోతే చదువుకొనే హక్కు లేనట్లే కదా. ఇక్కడ విద్యార్థులకు పాఠశాల లేక పోనురాను ఆరు కిలోమీటర్ల దూరం ప్రమాదకరంగా ఉన్నప్పటికీ నడుచుకుంటూ వేరే గ్రామానికి వెళ్లి చదువుకోవలసి వస్తుంది. విద్య హక్కు చట్టం 2009 ప్రకారం రానుపోను 5 కిలోమీటర్ల పరిధిలో పాఠశాల ఉండాలి. రాజ్యాంగ సవరణ 86 ద్వారా ప్రతి విద్యార్థికి 14 ఏళ్ల వయస్సు వరకు ఉచిత విద్యకు ప్రభుత్వం ఉచిత యూనిఫామ్స్. పుస్తకాలు అందించి విద్యను అందించడం చట్టం చేసింది. కానీ రాష్ట్రంలో దాన్ని సర్కార్ ఉల్లంఘించి రాజ్యాంగం కల్పించిన చదువుకునే హక్కు లేకుండా చేస్తుందని. విద్యను సామాజిక న్యాయం సాధనంగా చూడాల్సిన ప్రభుత్వం. దాన్ని మార్కెట్ శక్తులకు అప్పగించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని సంకల్పం లేకపోవడం. ఉన్న వనరులను సక్రమంగా వినియోగించకపోవడం. ప్రణాళిక లోపాలు. ఈ మూడు కలిసి బలా హన్ పూర్ గ్రామం వంటి ప్రాంతాల్లో విద్య సంక్షోభాన్ని మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నా యని ఇప్పటికైనా ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాలని ప్రభుత్వ పాఠశాలను అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వెంటనే పాఠశాల మంజూరు అయ్యేలా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో. నరాల ప్రహ్లాద్ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి. కొండు సాయి కుమార్ సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు. మాలం తిరుపతి. రాలి లక్ష్మి. తుంగెడ మధునక్క. దూలం పద్మ. రాలి మల్లేశ్వరి. ఎలిగేటి మధు నమ్మ. రాలి దివ్య. మడే గంగమ్మ. బత్తిని సాలక్క. ఆత్రం అంజలి. దూలం మొండక్క. దూలం లక్ష్మి. దూలం కమల. దూలం సుమలత. దూలం రేణుక. దూలం సీతమ్మ. మడే శ్రీలత. మడే గంగక్క. జపం సంతరి. జపం బొంద అక్క. మడే దేవేంద్ర. అగ్గిల కమల. మడే రాము బాయి. బుర్సా భీమక్క. ఎలిగేటి సాయి కుమార్. తదితరులు పాల్గొన్నారు.

## అంటరానితనాన్ని వివక్షత నిర్మూలించేందుకు పౌర హక్కుల దినోత్సవం



**మహదేవపూర్: జూన్ 30 (జనం సాక్షి) :** అంటరానితనాన్ని వివక్షత నిర్మూలించేందుకు మహదేవపూర్ మండలంలోని చంద్రుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ ప్రజల సమక్షంలో తాసిల్దార్ సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో పౌరాకుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గురుసింగబాబు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ బాపు. తాసిల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ. షెడ్యూల్ తెగలు కులాలపై గ్రామములో ఏదేని అంటరానితనముగాని అస్పృశ్యత, వివక్షత, ఉన్న ఎడల వాటి గురించి చర్చించడం జరిగిందని వాటిని నిర్మూలించుటకు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకొనుటకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ఆర్ఐ రఘు. గ్రామ పరిపాలన అధికారి రాజశేఖర్. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్. ఏఐఏవైఎస్ ప్రెసిడెంట్ మెరుగు లక్ష్మణ్. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రతి కార్యకర్త దగ్గరుండి విజయవంతం చేయాలి

### జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పిలుపు



**ములుగు ప్రతినిధి, జూన్ 30(జనంసాక్షి).** జిల్లాలో ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను పార్టీ కార్యకర్తలు, నాయకులు అత్యంత బాధ్యతగా క్షేత్రస్థాయిలో ఉండి నిర్వహించాలని ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాలలో బూత్ స్థాయి నాయకులతో కలిసి ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో, వార్డుల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకుడిని గుర్తించి, కొత్త ఓటరుగా నమోదు చేయించాలి, ఓటరు కార్డులలో తప్పులు, మార్పులు చేర్పులు ఉన్నట్లయితే వాటిని బిఎల్ఓ లతో కలిసి దగ్గరుండి సవరించాలి. అలాగే మరణించిన వారి వివరాలను, ఊర్లో లేని వారి (డూప్లికేట్) ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించేలా క్రమబద్ధీకరించాలి. ప్రతి బూత్ పరిధిలో కార్యకర్తలు చురుగ్గా కదిలి, ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందేలా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తాటి కృష్ణ, బైకాని ఓదేలు, జంగాలపల్లి సర్పంచ్ ముడతనపల్లి మోహన్, కాకులమర్రి ప్రదీప్ రావు, ఎండి వలి బాబా, కాసిందేపేట సర్పంచ్ అమర్ సింగ్, అనుముల సురేష్, శ్రీనివాసరెడ్డి, కవంపల్లి బాబు, పులుసం పురుషోత్తం, సత్యనారాయణ, నవీన్, నగేష్, యలవర్తి శ్రీనివాస్ రావు తదితర బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మరణించిన కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

**చిట్యాల, జూన్ 30( జనం సాక్షి):** మానేరు వాగులో అక్రమంగా విద్యుత్ షాక్‌తో చేపలు పడుతూ, వ్యక్తి మృతి చెందిన కేసులో నలుగురు నిందితులను చిట్యాల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించినట్లు సీఐ డి. మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కాల్వపల్లి గ్రామానికి చెందిన మేకల రాజు అనే వ్యక్తిని, అదే గ్రామానికి చెందిన మనుబోతుల రఘుపతి, అతని స్నేహితులు బలవంతంగా మానేరు వాగుకు చేపలు పట్టడానికి తీసుకెళ్లారు. వాగు పక్కనే ఉన్న వ్యవసాయ మోటార్ స్టార్టర్ నుండి అక్రమంగా విద్యుత్ వైరు సహాయంతో నీటిలో కరెంట్ షాక్ పెట్టి చేపలు పడుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు ఫెయిల్ అయి కరెంట్ లీక్ అయింది. మేకల రాజు అట్టి లాగుతుండగా తీవ్రమైన విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదం జరిగిన వెంటనే భయంతో నిందితులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి, విద్యుత్ వైరుతో సహా అక్కడి నుండి పారిపోయారు. మంగళవారం రోజున ఉదయం సమయంలో గిద్దెముత్తారం గ్రామ సమీపంలో, నిందితులు నలుగురు కలిసి బెయిల్ కొరకు ప్రయత్నించేందుకు వెళ్తుండగా, చిట్యాల పోలీసులు వారిని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన విద్యుత్ వైరును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నలుగురు తమ నేరాన్ని అంగీకరించారు. అరెస్టయిన నిందితులుమనుబోతులరఘుపతి, భూక్య సమ్మయ్య, మరో ఇద్దరు మైనర్ లు ఉన్నారు.ఎవ్వరు కూడా వాగులు, వంకలు, చెరువులలో విద్యుత్ వైర్లు ఉపయోగించి చట్టవిరుద్ధంగా చేపలు పట్టకూడదు. విద్యుత్ లైన్ల నుండి అక్రమంగా కరెంట్ కనెక్షన్లు తీసుకోవడం, వైర్లతో ప్రయోగాలు చేయడం ప్రాణాంతకం మరియు తీవ్రమైన చట్టరీత్యా నేరం.ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు. ఈ కేసును లో నిందితులను చాకచక్యంగా పట్టుకోవడానికి సహకరించిన పోలీస్ సిబ్బందిని సి.ఐ అభినందించారు.

# పద్మశాలి కుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**చెన్నారావుపేట, జూన్ 30 ( జనం సాక్షి):** పద్మశాలి కుల సంఘం నూతన కమిటీ ఎన్నికను మంగళవారం నిర్వహించారు .అధ్యక్షులుగా - పర్శ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల సాంబయ్య, కోశాధికారిగా అందె సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా ములుక ఐలయ్య, సహాయ కార్యదర్శిగా కందగట్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా చిలుకూరి సురేష్, సిద్ధ సుమన్,కుసుమ శ్రీనివాస్ గోరంట్ల మహేష్, ముఖ్య సలహాదారులుగా కుసుమ నరేందర్, వెంగళ రవీందర్, ములక సాంబయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నర్సంపేట మండల పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షులు నామాల సత్యనారాయణ, నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కూచన శ్రీనివాసరావు, చెన్నారావుపేట మండల ప్రధాన కార్యదర్శి ఈగ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30, జనంసాక్షి** మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మున్సిపల్ పరిధిలోని చత్లపూర్ గ్రామంలో గల డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఇతర అధికారులతో కలిసి సందర్శించి డంపింగ్ యార్డ్, ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతిరోజు తడి, పొడి చెత్తను ఇంటింటి నుండి తప్పనిసరిగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, వ్యర్థాల నిర్వహణలో మెరుగైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ఇటీవల అకౌంట్స్ విభాగంలో పొంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరాభరణం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్యాలయ భద్రత, నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యాలయ ఆవరణలో మీ-సేవ కేంద్రాన్ని సందర్శించి సేవలు పొందుతున్న ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రభుత్వ సేవలు నిమిత్తం మీ సేవా కేంద్రానికి వచ్చే ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్, పర్యావరణ ఇంజనీర్ గోపికృష్ణ, రెవెన్యూ అధికారి కృష్ణ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాటారం పోలీస్ స్టేషన్ మరియు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



**కాటారం జూన్ 30 (జనం సాక్షి ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా కాటారం పోలీస్ స్టేషన్ మరియు సబ్ డివిజన్ పోలీస్ ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా "వన మహోత్సవం" కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్టేషన్ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ గారు పేర్కొన్నారు.

# విద్యార్థులు పాఠశాలకు 100 శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

## కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత





**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 30(జనంసాక్షి ):** విద్యార్థులు పాఠశాలలకు 100 శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల పెట్రోల్ బంక్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సరుకుల నిల్వ గది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు 100 శాతంతో పాఠశాలలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులకు విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థులకు ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో పట్టు సాధించేలా తర్ఫీదు అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని తెలిపారు. బడి బయట తిరుగుతున్న విద్యార్థిని పాఠశాలకు ఎందుకు వెళ్లలేదని వివరాలు అడిగి ప్రతి రోజు పాఠశాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించి వంటశాల, సరుకుల నిల్వ గదిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన ఆహారాన్ని అందించాలని, కాలం చెల్లిన సరుకులను వంట తయారీలో వినియోగించకూడదని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా, విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, గురుకుల పాఠశాలకు ఇంకా రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ జయప్రద, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్లను పరిశీలించిన జిఆర్ఎంబి చైర్మన్ పి డోర్జే గ్యాంబా గారుఫమ జాంబ



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 29 ( జనం సాక్షి ) :** నియోజకవర్గ పరిధిలోని స్టేషన్గన్పూర్, గండి రామారం మల్లన్న గండి, ధర్మసాగర్ రిజర్వాయ ర్లను సోమవారం జి ఆర్ ఎం (గోదావరి నదీ యాజమాన్య బోర్డు) చైర్మన్ పి. డోర్జే గ్యాంబా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆర్ ఎస్ ఘన్ పూర్ రిజర్వాయర్, ఆర్ఎస్ ఘన్‌పూర్ పంప్‌హౌ స్ తనిఖీ చేశారు. రిజర్వాయర్లలో ఉన్న నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం లో చీఫ్ ఇంజనీర్ (సిఈ) ఇరిగేషన్ ఆర్ సుధీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ ఈ) బి సీతారా మ్ నాయక్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఈఈ) బి సంపత్ కుమార్, ఏఈఈ లు సరా, వినోద్, సాయి తేజస్విని, నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, బానోతు రూప్లా నాయక్, శ్రీని వాస్ రాజిరెడ్డి, రాములు, గయాస్,రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి రాంసాయి నటన అద్భుతం

● **సినిమా నిర్మాత నేరెళ్ల దేవేందర్**

**ములుగు,జూన్30(జనం సాక్షి):** షైన్ స్టూడియో బ్యానర్ పై రూపొందుతున్న "ప్రొడక్షన్ నెం.2 సినిమా చిత్రీకరణలో భాగంగా గత కొంతకాలం గా వెంకటాపూర్ మండలం లోని పలు గ్రామాలలో సినిమా షూటింగ్ జరుగుతుంది. ముఖ్యం గా హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రం లో గల పురాతన కట్టడమైన గడి వద్ద మరియు వెంకటాపూర్ మండలం లోని నందిపాడు గ్రామాల్లో సినిమా కి సంబందించిన ముఖ్య సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. అందులో హీరో చిన్నప్పటి క్యారెక్టర్ చేస్తున్న హన్మకొండ లోని బాలసముద్రానికి చెందిన ఐదవ తరగతి విద్యార్థి కోడిపాక రామ్ సాయి అద్భుతంగా నటిస్తున్నాడని చిత్ర నిర్మాత నేరెళ్ల దేవేందర్ తెలిపారు. మంగళవారం మండలంలోని జవహర్ నగర్ గ్రామ సమీపంలో గల నందిపాడు వద్ద చిత్ర నిర్మాణంలో భాగంగా తీసిన కొన్ని సన్నివేశాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ రామ్ సాయి అద్భుత నటనను ప్రదర్శించి ఆర్టిస్టులతోపాటు





చూపరుల మనసు గెలుచుకున్నాడు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత నేరెళ్ల దేవేందర్ మాట్లాడారు. సినిమా నిర్మాణంలో భాగంగా హీరో అజయ్ చిన్నప్పటి క్యారెక్టర్ నిమిత్తం ఆడిషన్ నిర్వహించి హన్మకొండ లోని బాలసముద్రం కు చెందిన కోడిపాక రామ్ సాయి ని ఎంపిక చేయటం జరిగిందని తెలిపారు. ఎలాంటి ఎక్స్పీరియన్స్ లేకున్నప్పటికీ రామ్ సాయి సింగిల్ టేక్ లో డైలాగులు చెప్పడంతో పాటు చూపరులను లను ఆకట్టుకునే విధంగా అద్భుతంగా నటిస్తున్నారని పేర్కొన్నారు. రామ్ సాయి కి మంచి భవిష్యత్తు ఉంటుందని నిర్మాత ఈ సందర్భంగా కొనియాడారు. అదేవిధంగా సినిమా నిర్మాణం 50% పూర్తయిందని ఆయన వెల్లడించారు. మరో నెల రోజులపాటు ములుగు జిల్లాలోనే చిత్ర నిర్మాణం కొనసాగుతుందని, మా యూనిట్కు సహకరిస్తున్న ములుగు జిల్లా ప్రజలందరికీ ఆయన సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమం లో సినిమా ప్రొడ్యూసర్ వేణు యాదవ్, హీరో అజయ్ -,హీరోయిన్ అశ్విత లతో పాటు మూవీ డైరెక్టర్ నేరెళ్ల దేవేందర్, కో డైరెక్టర్ ఆర్య అరవింద్, లిరిక్స్ రైటర్ రాజ్ కుమార్, మూవీ ఎడిటర్ యూనిక్,డిఓపి తరుణ్, అసిస్టెంట్ డైరెక్టర్ లోకేష్, ప్రొడక్షన్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్, యూనిట్ సభ్యులు సిద్దు, రఘు, రాహుల్, రఘుపతి, శ్రీనాథ్,లోకేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**మావల (జనంసాక్షి):** తెలంగాణ పాలీసెట్--2026 ప్రవేశాల అనంతరం మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ఆదిలాబాద్‌లోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 30న ఖాళీ సీట్ల వివరాలను ప్రదర్శించగా, జూలై 1 నుంచి 3 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 4న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్‌లో 25, సివిల్ ఇంజినీరింగ్‌లో 18, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో 5, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 17, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 21 సీట్లు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే అభ్యర్థులు టీజీ పాలీసెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్సెస్సీ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికేట్లు, కుల ధ్రువీకరణ పత్రం తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రవేశం పొందేందుకు ఇది మంచి అవకాశమని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**శాయంపేట , జూన్ 30 (జనం సాక్షి) :** ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జులై 7న ఘనంగా నిర్వహించనున్నట్లు శాయంపేట మండల ఇంచార్జ్ ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మామిడి భాస్కర్ తెలిపారు. గట్ల కానిపర్తి ,మైలారం గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో గో టు విలేజ్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. జులై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ను ఆవిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దేవయ్య డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు రవి, సుమన్, సదానందం, భద్రయ్య, కుమారస్వామి, ఆనందం, పోచయ్య ,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత, జవాబుదారీతనం పెరగాలి

సేకరించి ప్రత్యేక జాబితా రూపొందించాలని ఆదేశించారు. తరచూ గైర్హాజరవుతున్న వారిని గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై కూడా కమిషనర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఉద్యోగుల ఈపీఎఫ్ చందాలు క్రమం తప్పకుండా వారి ఖాతాల్లో జమ అవుతున్నాయా, ఇందుకు అమలులో ఉన్న విధానం ఏమిటనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డులో స్వచ్ఛ ఆటోల నిర్వహణ, చెత్త సేకరణ విధానం, డ్రైనేజీ శుభ్రత కార్యక్రమాల అమలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. శానిటేషన్ నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన నగర నిర్మాణమే జీడబ్ల్యూఎంసీ లక్ష్యమని పేర్కొన్న కమిషనర్, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, గోల్కొండ శ్రీను, ఇతర అధికారులు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

సేవలు ప్రశంసనీయమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులతో మరింత సమయం గడుపుతూ ఆనందకరమైన జీవితం గడపాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ అయిన ఎండి. షాఖాన్, పులియాల రాజిరెడ్డి, రాజారపు వెంకటరత్నం దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధిలో భాగంగా నాబార్డ్ క్లస్టర్ ఏర్పాటు

**లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి**




**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి) :** గ్రామీణ, వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమంలో భాగంగా మంచిర్యాల కేంద్రంలో నాబార్డు క్లస్టర్ ఏర్పాటు చేయడం జరిగిందని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ చేతన్, డి.ఎ.ఓ. సురేఖ, డి.బి.ఎ.హెచ్.ఓ. యాకుబ్ రెడ్డి, ఎ.డి.సి.సి. సి.ఈ.ఓ. రవి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉపేందర్, డి.ఐ.సి.జి.ఎం. శ్రీనివాస్ లతో కలిసి నా బార్డ్ క్లస్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ గతంలో ఆదిలాబాద్ నుండి క్లసర్ నడపడంతో దూరాభారం అయ్యేదని, ఇపుడు మంచిర్యాలలో ప్రారంభించడం ద్వారా నాబార్డ్ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శక సంస్థగా పని చేస్తుందని, గ్రామీణ మౌలిక వసతులు, వాటర్‌షెడ్ అభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, జీవనోపాధి కార్యక్రమాల ద్వారా లక్షలాది గ్రామీణ కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకు వస్తుందని తెలిపారు. గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అనే లక్ష్యంతో నాబార్డు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె. అధికారి సాద్వి రెడ్డి, మత్స్యశాఖ అధికారి భవ్యశ్రీ, వాసన్ ఏకలవ్య ధన్ ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పెద్దవంగర ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్‌కు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు



**పెద్దవంగర జూన్ 30(జనం సాక్షి) :** పెద్దవంగర మండల ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ పదవీ విరమణ పొందగా ఎంపీడీవో కార్యాలయ అధికారులు, జిల్లా అధికారులు మంగళవారం ఘనంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమవేశం నిర్వహించి వేణుమాధవ్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి, అదనపు జిల్లా కలెక్టర్ పురుషోత్తం, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మధుసూదన్ రాజు, అడిషనల్ డి ఆర్ డి ఓ మల్లీశ్వరి ,జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, తోర్రుర్ డివిజన్ పంచాయతీ అధికారి పుల్లారావు, సభాధ్యక్షులు సర్పంచ్ ముద్దసాని పారిజాతసురేష్, రిటైడ్ డిప్యూటీ సిఈఓ నర్మదా, మండల తహసీల్దార్ వినోద్ కుమార్,ఎస్సై ప్రమోద్ కుమార్,మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్,ఎంఈఓ శ్రీనివాస్,కురవి ఎంపిడిఓ వీరబాబు, బంగ్లా ఎంపిడిఓ వేణుమాధవ్ రెడ్డి, జ్ఞాపికలను అందజేస్తూ, పూలమాల వేస్తూ, ఎంపీడీవో దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

**సర్పంచ్ పోరిక సరిత**



**ఏటూరునాగారం, జూన్ 30(జనంసాక్షి) :** మండలం లోని రాం నగర్, లంబాడి తండా గ్రామాల విద్యార్థులు విద్యాభ్యాసం కొరకు రామన్నగూడెం పాఠశాలకు మరియు ఏటూరునాగారం కళాశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో వరంగల్ డిపో మేనేజర్ రవిచందర్ తో కోయగూడా ఎల్లాపూర్ సర్పంచ్ పోరిక సరిత శ్రీను ఫోన్లో సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన డిఎం రవిచందర్ ఈ సమస్యను అతి త్వరలోనే పరిష్కరించి విద్యార్థులకు రవాణా కష్టాలు తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. తమ గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పై అధికారులతో చర్చలు జరిపి సమస్యలను తీర్చడంలో ముందున్న సర్పంచ్ సరిత శ్రీను, లను గ్రామస్తులు అభినందిచారు.

## దిలావర్‌పూర్ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీవో



**దిలావర్‌పూర్, జూన్ 14, (జనం సాక్షి):** దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీవో గోవర్ధన్, ఈవో మహేందర్ తో కలిసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అధికారులు ముందుగా వసతి గృహంలోని వంటగదిని తనిఖీ చేసి, వంట సామగ్రి నాణ్యత, నిల్వ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు శుభ్రమైన, పోషకవిలువలతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని, వారి సంక్షేమంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అనంతరం మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. రాబోయే వర్షకాలం దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రతలో రాజీపడ వద్దని వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపీఓ, అధికారుల బృందం లోలం గ్రామ పంచాయతీని సందర్శించి, పంచాయతీ రికార్డులను తనిఖీ చేసారు. అనంతరం నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ పరిశీలించారు. గ్రామంలో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందిం చేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎంపీవో గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు, పాఠ్యపుస్తకాల పంపిణీ



**పాలకుర్తి, జూన్ 30(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థులకు మంగళ వారం మండల విద్యాధికారి పోతుగంటి నర్సయ్య చేతుల మీదుగా పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, విజేందర్, మంజుల, ఎన్. శ్రీనివాస్, సీఆర్పీ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ హఠావో, తెలంగాణ బచావో

- ఎన్ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన
- తల్లితండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కార్పోరేట్ విద్యా సంస్థలు
- నీరటి రామ్ ప్రసాద్ పటేల్, ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు




**మంచిర్యాల ప్రతినిధి జూన్ 30(జనం సాక్షి)** : కార్పొరేట్ పాఠశాలలు ఎస్ఆర్, శ్రీ చైతన్య, అల్ఫోర్స్, నారాయణ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో నిలువు దోపిడీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ ...జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తూ, మరోవైపు అడ్మిషన్ పొందిన విద్యార్థుల కు సంబంధించి ఫీజు కన్ఫర్మేషన్, అడ్మిషన్ ఫీజు అంటూ దందా నిర్వహిస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంల పేరు తో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ విషయాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందని ఆరోపించారు. మరోవైపు కొన్ని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులు మమ్మల్ని ఏం చేయలేరంటూ బాహాటంగానే చెబుతూ ప్రశ్నించే వారిపై మావి కార్పొరేట్ సంస్థలు అన్నంత ఫీజులు చెల్లించే స్థోమత లేని వారు ప్రభుత్వ పాఠశాలలో వేసుకోవాలని ఎదురుదాడికి దిగుతున్నారని వారు వాపోయారు. కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలను వారి పాఠశాల పేర్లతో ముద్రించి విక్రయిస్తూ / "విద్యాశాఖ నిబంధనలను కాలరాస్తున్న" అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు పుస్తకాల పై అధిక ధరలు ముద్రించి దోచుకుంటున్నాయని,పుస్తకాలను ఆయా పాఠశాలలకు దగ్గరలోని ఏదో ఒక శెట్టర్ రూమ్, లేదా ఇంటిని అద్దెకు తీసుకుని బహిరంగంగానే విక్రయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి విద్యా సంవత్సరం ప్రారంభం అయి నెల రోజులన్న గడవక ముందే వివిధ రకాల పేర్లు (టెక్నో,ఐఐటీ, నీట్, స్మార్ట్, ఐ.పి.ఎల్, సి.బి.ఎస్.ఈ, ఇంటర్నేషనల్, ఓలాశీప్యాడ్, కాన్సెప్ట్, ఏక్షలేన్సివ్) లాంటి పదాలు తగిలించి కనీస మౌలిక వసతులు లేకుండా ఇష్టానుసారంగా నియంత్రణ లేని ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (చీమఫీ) ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ విద్యార్థి సంఘాలతో కలిసి రూపొందించి త్వరలోనే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సైతం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్, జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్,ఇర్ఫాన్, అశ్వంత్,సంతోష్,అంజి తదితర నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్ పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



**నిర్మల్ బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి):** నిర్మల్ పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పట్టణ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, వివిధ అభివృద్ధి పనుల అమలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ, నిర్మల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రజల అవసరాలు, సమస్యలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తాం. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్లు తమ తమ వార్డులకు సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని అధికారులు, సంబంధిత శాఖల సిబ్బందికి వైస్ చైర్మన్ సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, కమిషనర్ రవిబాబు,కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొని పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు తీర్మానాలను ఆమోదించారు.

## న్యాయం చేయండి

- సిపిఎం మండల నాయకులు రామగళ్ళ అశోక్

**బచ్చన్నపేట, జూన్ 30, ( జనం సాక్షి):** బచ్చన్నపేట మండలంలోని చిన్నరామచర్ల శివారులోని గుర్రాల నర్సిరెడ్డి తనబావి దగ్గర నిర్మించిన వాటర్ షెడ్డులో పడిన మేకను కాపాడపోయి అదే నీటిలో పడి గుండా వాని( 33) భర్త ఉపేందర్ అనే మహిళ మృతి చెందిందని వాటర్ షెడ్డు కు ఫెన్సింగ్ లేకనే వాణి మృతి చెందిందని నిరుపేద కుటుంబానికి చెందిన వానికి న్యాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల నాయకులు రామగల అశోక్ అన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- నిందితుల అరెస్ట్

**ఆత్మకూర్, జూన్ 30 (జనం సాక్షి):** మంగళవారం రోజున పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్.ఐ. పి. తిరుపతి ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆకస్మిక దాడిలో, హేమంత్ కుమార్ ఇంట్లో డబ్బులు పెట్టి మూడు ముక్కలాట (పేకాట) ఆడుతున్న 10 మంది వ్యక్తులపై కేసు నమోదు చేయబడింది. ఈ దాడిలో తొలుత 6 మంది నిందితులను అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఏ7 నుండి ఏ 9 వరకు ముగ్గురు నిందితులను కూడా అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.600/- నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ కేసులో మొత్తం 9 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి మొత్తం రూ.4,040/- నగదు, 52 ప్లేయింగ్ కార్డులు 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ 10 - అన్నం నాగ రాజు, పెద్దాపూర్ గ్రామ నివాసి ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని త్వరలోనే అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



**కాళేశ్వరం, జూన్ 30 (జనం సాక్షి)** : భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, మెట్ పల్లి, చంద్రుపల్లి గ్రామాలలోని పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మహాదేవపూర్ మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాను పరిశీలించి, అధికారులకు పలు విలువైన సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, తప్పులు లేని జాబితా రూపొందించాలని కోరారు.అలాగే ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మాజి మహిళా విభాగం మంథని నియోజకవర్గం ఇంచార్జి కేదారి గీత, మాజీ మండల యూత్ అధ్యక్షుడు యండి అలీం ఖాన్, నాయకులు సుంకే మధు, కళ్యాణ్ రావు,కాళేశ్వరం రెండవ వార్డ్ మెంబర్ నిట్టూరి మహేష్, బర్ల కుమార్,బడికెల మహేందర్, కాటారపు శ్యామ్, మోతె సాయి, రాకేష్, నిట్టూరి దేవేందర్, కోరుకొప్పుల సాయి, అడప సంతోష్,కావేరి శేఖర్, గోమాస సంతోష్,గోమాస రమేష్, జాడి చిన్న సమ్మయ్య, గోమాస లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా రాక ఇబ్బంది పడుతున్న ప్రజలు



**ఆత్మకూర్, జూన్ 30 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ళ గ్రామంలో రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపి వేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నీరుకుళ్ళ గ్రామంలో రెండు మిషన్ భగీరథ ట్యాంకులు ఉన్న నీరు సరఫరా లో మాత్రం అధికారులు ప్రజాప్రతి నిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీనితో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎలాంటి బోరు బావులు గాని చేతిపంపులు గాని లేకపోవడంతో కేవలం గ్రామపంచాయతీ సరపర చేసే మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడుతున్నామని రెండు రోజుల నుండి నీటి నిలిపేయడంతో మేము ఎక్కడికి వెళ్లి నీరు తెచ్చుకోవాలని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు కనీసం వాటర్ ట్యాంక్ ద్వారా కూడా నీటి సరఫరా చేయకపోవడం చాలా ఇబ్బందికి గురవుతున్నామని గ్రామపంచాయతీ అధికారులను నీటి సరఫరా విషయంలో నిలదీస్తే పైపులైన్ల మరమ్మతు కారణంగా నీటిని సప్లై చేయలేకపోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని మా నీటి గోస తీర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## చంద్రుపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



**కాళేశ్వరం , జూన్ 30 , ( జనం సాక్షి)** : భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని చంద్రుపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) కార్యక్రమం స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, దళిత సంఘాల నాయకులు మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మహాదేవపూర్ మండల అధ్యక్షులు మెరుగు లక్ష్మణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు కల్పించిందని చట్టం ముందు అందరూ సమానులే నని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి నెల చివరి రోజున నిర్వహిస్తున్న పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కుదురుపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు గోగుల నాగేందర్ , చంద్రుపల్లి గ్రామ సర్పంచ్ గురిసింగ్ సింగ్ బాపు , వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, దళిత సంఘాల నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతమే లక్ష్యం

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జలగం ప్రవీణ్
- రాష్ట్ర అధ్యక్షుడి జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ



**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 ( జనం సాక్షి ) :** బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జలగం ప్రవీణ్ పిలుపునిచ్చారు. బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు ఇబ్రం శేఖర్ జన్మదినం పురస్కరించుకొని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జలగం ప్రవీణ్, ప్రజాసంఘాలు నాయ కుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసిన అనంతరం బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి,స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో బిఎస్పి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కార్యదర్శి మునిగేల వెంకన్న ముదిరాజ్,దార వెంకయ్య, చాడ ఏలీయా,గాదె శ్రీధర్,గుర్రం శ్రీకాంత్ సివిల్ కాంట్రాక్టర్,బలిజ హరీష్,రాజశేఖర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.